క్లుప్తంగా

తాగునీటి పనులకు శంకుస్థాపన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 28వ డివిజన్ భానూనగర్ జంక్షన్ వద్ద బుధవారం రూ. 42.08లక్షల వ్యయంతో తాగునీటి పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ వీరమాచనేని లలితతో కలిసి తాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలోనే నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిగినీడి రామారావు, పీ రామకృష్ణ, ద్వారక, జోగినాయుడు, పవన్, సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ వితరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయానికి పాఠకులు, సిబ్బంది సౌకర్యార్థం శిఖామణి సెంటర్‌కు చెందిన విశ్రాంత లెక్చరర్ వీఎల్ఎన్ రావు రూ. 15వేల ఖరీదైన వాటర్ ప్యూరిఫయర్‌ను బుధవారం అందజేశారు. దాత అందించిన ప్యూరిఫయర్‌ను గ్రంథాలయాధికారి కే రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె దాత వీఎల్ఎన్ రావును అభినందించారు. నిత్యం గ్రంథాలయానికి వందలాది పాఠకులు వస్తుంటారని, వారికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కే రాంబాబు, వై ధనలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు




మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీమణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి స్వామివారికి విశేషంగా పంచామృత అభిషేకం, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మాలధారులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మోరియా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రామానగర్ కాలనీ వీఎంసీ గ్రౌండ్స్‌లో క్రిస్మస్ సువార్త కూడిక బుధవారం ఘనంగా జరిగింది. బిమేర్షాబా సంఘకాపరి పాస్టర్ ఇమ్మానుయేల్ జయరాజ్ ముఖ్య ప్రసంగికులుగా విచ్చేసి మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసు పుట్టిన రోజుకు గుర్తుగా జరుపుకొనే పండుగ క్రిస్మస్ అని అన్నారు. ప్రభువు బోధనలను వివరించారు. ఈ సందర్భంగా సండే స్కూల్ చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో వేసిన నృత్యాలు, మహిళలు ఆలపించిన గీతాలు అలరించాయి.

అలరించిన భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య బృందం ఆలపించిన భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య, పాలపర్తి ఆంజనేయ శాస్త్రి, జగన్మోహిణి బృంద సభ్యులు పలు కీర్తనలను వీనుల విందుగా ఆలపించారు. పాలపర్తి ఆంజనేయ శాస్త్రి వయోలిన్‌పై, జగన్మోహిణి మృదంగంపై చక్కటి సహకారం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో రామయ్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఆలయ డీఈఓ రత్నరాజు రామయ్య బృందానికి అమ్మవారి చిత్రపటం అందించి అభినందించారు. కార్యక్రమానికి ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

నత్తనడకన యూజీడీ పైపులైన్ పనులు

- గత 12 రోజులుగా రాకపోకలు బంద్
- పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి



దేవీనగర్‌లో యూజీడీ పైపులైన్ పనుల్లో భాగంగా మూసివేసిన రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ యూజీడీ పంపింగ్ స్టేషన్ సమీపంలో యూజీడీ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక్కడ గత 12 రోజులుగా మరమ్మతులు సాగుతూనే ఉన్నాయి. యూజీడీ పైపులైన్ పనుల్లో భాగంగా రోడ్డును మూసివేశారు. దీంతో రామకృష్ణాపురం నుంచి దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, గుణదల, మధురానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేసిన అధికారులు ఎన్ని రోజుల్లో పని ముగిస్తారో చెప్పలేని స్థితిలో ఇక్కడ పనులు జరుగుతున్నాయి.

పనుల్లో తీవ్ర జాప్యం

బుడమేరు వరదల ప్రభావంతో ఇక్కడ రోడ్డు నాణ్యత దెబ్బతింది. ఇటీవల యూజీడీ పంపింగ్ స్టేషన్ సమీపంలో మ్యాన్‌హోల్ వద్ద లారీ దిగబడింది. దీంతో జేసీబీతో ఆ లారీను బయటకు తీశారు. అయితే పైపులైన్ దెబ్బతినడంతో చిన్నపాటి మరమ్మతులేనంటూ అధికారులు పనులు ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ పక్కనే బుడమేరు ఉండటంతో పైపులైన్ పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు. వాటర్ పైపులైన్ పనుల కోసం తవ్విన గోతుల్లోకి నీళ్ల వస్తున్నాయి. వాటిని మోటారుతో బయటకు తోడినప్పటికీ మరుసటి రోజుకు యథావిధిగా నీళ్ల వస్తున్నాయి. దీంతో పనులు ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్నచందంగా మారింది.

చుట్టూ తిరిగి వెళ్లాలి

యూజీడీ పనుల్లో భాగంగా ఇక్కడ గత 12 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో దేవీనగర్ నుంచి రామకృష్ణాపురం వెళ్లాలంటే చుట్టూతిరిగి వెళ్లాల్సివస్తోంది. పక్కనే బుడమేరు మధ్యకట్ట మీద నుంచి వెళ్లాలని అనుకుంటే అక్కడ పడిన బుడమేరు గండి పనులు నేటికీ పూర్తిచేయకపోవడంతో మధురానగర్ మీదుగా వెళుతున్నారు. దీని వల్ల విలువైన సమయంతో పాటు ఇంధనం కూడా వృధా అవుతోందని



పైపులైన్ పనుల కోసం తవ్విన గుంతలో నుంచి మోటారుతో నీటిని తోడుతున్న దృశ్యం

వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవీనగర్ మీదుగా వచ్చే సిటీ బస్సులు సైతం రాలేని పరిస్థితి నెలకొంది.

హెచ్చరిక బోర్డు కూడా లేదు



ఇక్కడ దాదాపు రెండు వారాలుగా రాకపోకలు నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పటికప్పుడు రోడ్డు పనులు పూర్తి అయ్యి ఉంటాయని ఇక్కడకు వస్తున్నాం. పనులు పూర్తికాకపోవడంతో వెనక్కుతిరిగి వెళ్లాల్సి వస్తోంది. కనీసం రోడ్డును బ్లాక్ చేశామని బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.

– డాక్టర్ బీ వసంతకుమార్, దుర్గాపురం

నానాయాతన పడుతున్నాం



ఇక్కడ యూజీడీ పంపింగ్ పనుల్లో భాగంగా రోడ్డును మూసివేశారు. బయటకు వెళ్లాలంటే చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తోంది. కనీసం బుడమేరు మధ్యకట్ట మీదుగా వెళదామంటే అక్కడ కూడా రోడ్డు ప్రమాదకరంగా ఉంది. పనులు, ఉద్యోగాలు, కళాశాలలకు వెళ్లేవారు రాకపోకలకు నానాయాతన పడుతున్నారు. కనీసం రోడ్డు మూసివేశారని సమాచారం కూడా లేదు. ఇక్కడ వరకు వచ్చి ఉసూరు మంటూ వెళుతున్నారు.

– గంగాద వెంకటేశ్వరరావు, దేవీనగర్

తాగునీటి సరఫరాలో మరింత నాణ్యత పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏజే వినోద్

పటమట(విజయవాడతూర్పు): తాగునీటి నిర్వహణలో నాణ్యమైన ప్రమాణాలను అమలు చేయాలని శాస్త్రవేత్త, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) విజయవాడ డైరెక్టర్ ఎం.ఎ.జె.వినోద్ సూచించారు. గుణదలలోని ఓ హోటల్‌లో బుధవారం మనక్ మంథన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, సెర్ప్, మెప్మా అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినోద్ మాట్లాడుతూ.. నగరాల్లో నీటి నిర్వహణ, పైపుల ద్వారా తాగు నీటి సరఫరా, నీటి నిర్వహణలో సాంకేతికతను మెరుగుపరిచేందుకు అనువైన మార్గాలను అనుసరించాలని సూచించారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ రమాకాంత్ సాగర్ తాగునీటి సరఫరాలో పైప్ లైన్ ఫిట్టింగ్‌లు, నీటి అలారమ్‌లు, బిందుసేద్యం తదితర అంశాల్లో సాంకేతికతను అనుసరించాలని సూచించారు.

రేపటి నుంచి సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు



స్వయంభూ శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పుట్ట వీధిలోని స్వయంభూ శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయం సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలకు ముస్తాబయ్యింది. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు షష్టి మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఆలయకమిటీ ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 6వ తేదీ శుక్రవారం విఘ్నేశ్వరపూజతో షష్టి మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7.30 గంటలకు కావడి ఉత్సవం, తొమ్మిది గంటలకు వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి మంగళ స్నానం, పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం, కలశ స్థాపన జరుగుతుంది. 7వ తేదీ శనివారం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీదేవసేన, శ్రీ వల్లీదేవీలకు కల్యాణం జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. 8వ తేదీ ఆదివారం ఉదయం లోక కల్యాణార్థం విశేషంగా హోమాలు, స్వామివారికి పుష్పార్చనలు జరుగుతాయి. రాత్రి 7 గంటలకు పవళింపు సేవతో షష్టి ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు షష్టి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ ధర్మకర్త బోయిన గోపాలకృష్ణమూర్తి, హరికృష్ణ కోరారు.

ఘనంగా ఎన్‌సీసీ నేవీ డే



స్టెల్లాలో జరిగిన ఎన్‌సీసీ నేవీ డే వేడుకలు

పటమట(విజయవాడతూర్పు): దేశానికి సేవ చేయాలంటే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరాలని ఎన్‌సీసీ 8వ ఆంధ్ర నేవీ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ ప్రదీప్ అన్నారు. స్టెల్లా కళాశాలలో ఇండియన్ నేవీ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు కెప్టెన్ ప్రదీప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఇండియన్ నేవీలో సేవలు అందించాలని, అగ్నివీర్ పథకం గురించి తెలుసుకోవాలని సూచించారు. 1971వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో నావికా దళం చేసిన వీరత్వాన్ని ఈ సందర్భంగా క్యాడెట్లకు వివరించారు. అనంతరం సబ్ లెటునెంట్ స్వప్న మాట్లాడుతూ.. భారత్ నావికా రంగం పాత్రను వివరించారు. అనంతరం పోస్టర్ కాంపిటీషన్ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల నుంచి నిర్మల కాన్వెంట్ జంక్షన్ వరకు భారత నావికా దళం శాంతి ర్యాలీ నిర్వహించింది. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు వెంకట రమణ, రాజశేఖర్, సిద్ధార్థ కళాశాల ఎన్‌సీసీ అధికారి లెటునెంట్ వెంకటేశ్ ఆకురాతి, పలువురు ఎన్‌సీసీ క్యాడెంట్లు పాల్గొన్నారు.

ఘంటసాల గాత్రశోభ అజరామరం



వేముల హజరత్తయ్య గుప్తాకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఘంటసాల గాత్రశోభ అజరామరమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఘంటసాల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ.. ఘంటసాల పాడిన భగవద్గీత ప్రజల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిందన్నారు. చాలా మంది గాయనీగాయకులు ఘంటసాల పాటలు పాడుతూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నంది పురస్కారాలతోపాటు, ఘంటసాల పేరుతో పురస్కారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత వేదిక వ్యవస్థాపకుడు బొబ్బిలి లీలా కుమార్ మాట్లాడుతూ.. ఏటా ఘంటసాల జయంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం చేస్తునట్లు తెలిపారు. వేముల హజరత్తయ్య గుప్తాకు ఘంటసాల స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో పైలా సురేష్, దేవతోట నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు హరికృష్ణ, కామేశ్వరి తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించారు.

ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలి

పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: యూనిఫాం ధరించకుండా ఆటోలు నడిపే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడం వల్ల ట్రాఫిక్ క్రమశిక్షణకు ఇబ్బందులు వస్తున్నాయని, యూనిఫాం నిబంధనలు ఉల్లంగించి పట్టుబడిన వారికి మొదటిసారి అవగాహన కల్పిస్తామని, రెండోసారి పట్టుబడితే జరిమానా విధించడంతో పాటు నిబంధనల ఉల్లంఘన నివేదికను రవాణా శాఖ అధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు. యూనిఫాం ధరించడం వల్ల డ్రైవర్‌కు గౌరవం, నైతిక బాధ్యత పెరుగుతుందని, ప్రజల భద్రత, ట్రాఫిక్ శ్రేయస్సు కోసం యూనిఫాం ధరించాలని సూచించారు.

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ గౌతమిశాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని డెప్యూటీ పోలీస్ కమిషనర్ గౌతమి శాలి సూచించారు. పటమట పంటకాలువ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో బుధవారం యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తోటివిద్యార్థులతో అమానుషంగా ప్రవర్తించే విధానమే ర్యాగింగ్ అని పేర్కొన్నారు. సీనియర్, జూనియర్ల మధ్య తత్సంబంధాలు మెరుగుపడేలా విద్యాసంస్థలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. వాటిలో పాల్గొని విద్యార్థులు కళాశాలల ప్రాంగణంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. చట్టరీత్యా ర్యాగింగ్ నేరమని, ఎవరు ప్రోత్సహించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కాలంలో యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్ వాడినా, సరఫరా చేసినా నేరమేనని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు తెలపాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. డ్రగ్స్ వినియోగిస్తున్న వారి సమాచారం ఇచ్చినా వారిని సక్రమైమ దారిలో ఉంచేందుకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్, కళాశాల డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బ్యూలా, ఇంటర్మీడియెట్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వున్నం స్వప్న, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఏకకాలంలో పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో కొత్తపేట సీఐ చిన కొండలరావు నెహ్రూ బొమ్మసెంటర్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటోల రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారితో రికార్డులు లేని వాహన చోదకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బ్రాహ్మణ వీధి, కోమల విలాస్ వైపు నుంచి వచ్చే వాహనాలతో పాటు పంజా సెంటర్, చిట్టినగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను సైతం తనిఖీ చేశారు. దీంతో కొంత మంది ఆకతాయిలు, రికార్డులు లేకుండా వాహనాలను నడిపే వారు పక్క దారుల వెంట వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని సైతం పోలీసులు రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు సీఐ కొండలరావు తెలిపారు.

పోటాపోటీగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఉద్యోగులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు రహస్య బ్యాలెట్ పద్ధతిలో బుధవారం మొదలయ్యాయి. డివిజన్ వ్యాప్తంగా రైల్వే ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో అక్కడే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధ, గురువారం జరిగే ఈ ఎన్నికల్లో మొదటి రోజు పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసులతో రైల్వే అధికారులు బందోబస్తు చేపట్టారు. పోటీలో ఉన్న కార్మిక సంఘం నేతలు రైల్వే స్టేషన్ వద్ద టెంట్‌లు వేసుకుని ఓటర్ల సమాచారం అందిస్తు తమ సంఘాలకు ఓటు వేసే దిశగా ప్రచారం చేశారు. ముఖ్యంగా ఎన్ఎఫ్ఐఆర్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఏఐఆర్ఎఫ్ (ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు ప్రధానంగా పోటీలో ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం (డీఎంఆర్‌కేఎస్) తమ గుర్తింపు కోసం పోటీలో నిలిచింది. ఈ నెల 12న ఫలితాలను ప్రకటిస్తారు.

అజాత శత్రువు రోశయ్య

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



రోశయ్య, ఘంటసాల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అజాతశత్రువు అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రోశయ్య వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రోశయ్యది ప్రత్యేక స్థానమని కొనియాడారు. సుమారు 50 ఏళ్ల తన రాజకీయ జీవితంలో గవర్నర్‌గా, ముఖ్యమంత్రిగా అనేక కీలక పదవులు పోషించి వాటికి వన్నె తెచ్చారని పేర్కొన్నారు.

అజరామరం.. ఘంటసాల గానం

అనంతరం ప్రముఖ సినీ గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మల్లాది విష్ణు ఘన నివాళులర్పించారు. విషు మాట్లాడుతూ తెలుగు సంగీత సామ్రాజ్యానికి రారాజు ఘంటసాల అని కొనియాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా మూలవిరాట్టు వేంకటేశ్వరస్వామి ఎదురుగా భక్తి గీతాలు ఆలపించిన ధన్యజీవి ఘంటసాల అని చెప్పారు. కార్యక్రమంలో 33వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, నాయకులు దోనేపూడి శ్రీనివాస్, కొప్పవరపు బలరాం, శనగవరపు శ్రీనివాస్, మల్లెం శ్రీను, చాంద్, సనత్, చంటి, మూర్తి చంద్రమౌళి, కష్టమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి



దర్గా ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, నిర్వీర్యం చేసే చర్యలకు స్వస్తి పలకాలని ఏపీ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు డిమాండ్ చేశారు. 'వలంటీర్లు ఆవేదన అల్లాకు చెబుదాం' పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వన్‌టౌన్ పంజా సెంటర్ వద్ద ఉన్న దర్గాలో బుధవారం సాయంత్రం వలంటీర్లు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా లంక గోవిందరాజులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు చేసిన ప్రకటనలు చాలా బాధాకరంగా ఉన్నాయన్నారు. ఉగాది పండుగ రోజున శుభవార్త చెప్తానని నమ్మబలికిన చంద్రబాబునాయుడు తమ జీవితాలను తారుమారు చేశారన్నారు. శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రకటించడం విచిత్రంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులకు వలంటీర్ల వ్యవస్థ లేదనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని 2,60,000 మంది వలంటీర్లకు న్యాయం చేస్తూ ప్రకటన చేయాలన్నారు. ఆ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి జి.మమత, నాయకులు రాజకుమార్, దమ్ము రమేష్, అబ్దుల్ జిలాని, పూజిత, ఆశాజ్యోతి, కల్యాణి, సోనీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో ఈనెల 16 నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహారాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ తెల్లవారుజామున 4.30 గంటలకు నగర సంకీర్తనతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం ఏడు గంటలకు అభిషేకం, తొమ్మిది గంటలకు ధనుర్మాస ఆరంభ అర్చన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామున నగర సంకీర్తనతోపాటు శ్రీ కృష్ణా గోదా అష్టోత్తర శతనామార్చన, తిరుప్పావై సేవ, పాశుర విన్నపం జరుగుతాయని చెప్పారు. వచ్చేనెల ఎనిమిదవ తేదీన విశేషంగా ముత్యాల హారతులు, 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, శ్రీ భూనీళా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామస్వామి, శ్రీరుక్మిణి గోదా సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి కల్యాణం, ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని వివరించారు. సాయంత్రం ముత్యాలంపాడు పురవీధుల్లో మేళతాళాలతో గరుడ వాహన సేవ నిర్వహిస్తామన్నారు. 11న కూడారై ఉత్సవం 108 లఘు గంగాళములతో పాయస నివేదన చేస్తామన్నారు. 13న ఉదయం 10 గంటలకు శ్రీ గోదా రంగనాథుల కల్యాణం, సాయంత్రం 6.30 గంటలకు శాంతి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు ధనుర్మాసోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.